నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, మంగళవారం 6 మే 2025 | HANUMAKONDA



గార్ల : పినిరెడ్డిగూడెంలో రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు
- పెద్దవంగర, పినిరెడ్డిగూడెం గ్రామస్తుల ఆందోళన
- ఒక్క ట్యాంకరైనా పంపించాలని నిరసన
- నెల రోజులైనా నీళ్లు రావడం లేదని మండిపాటు

# పల్లెల్లో తాగునీటి కష్టాలు

పెద్దవంగర/గార్ల, మే 5 : పల్లెల్లో తాగునీటి కష్టాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. చాలా చోట్ల రోజుల తరబడి నీళ్లు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మహిళలు రోడ్డెక్కుతున్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలకేంద్రంలోని మెయిన్‌రోడ్ కాలనీ వాసులతో పాటు గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామస్తులు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. నెల రోజులుగా తాగు నీళ్లు లేక గోస పడుతున్నామని, ఒక్క ట్యాంకరైనా పంపించండి అంటూ పెద్దవంగర మెయిన్ రోడ్ కాలనీ వాసులు ఎంపీడీవో కార్యాలయం వద్ద రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అలాగే వారం రోజులుగా పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పినిరెడ్డిగూడెం గ్రామస్తులు మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ, బోరు బావుల్లో నీళ్లు పుష్కలంగా వచ్చేవని,



పెద్దవంగర : ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

గత పదేళ్లలో ఎప్పుడూ తాగు నీటి కష్టాలు చూడలేదని అన్నారు. మెయిన్‌రోడ్ కాలనీ వాసుల కోసం మూడు బోర్లున్నా వాటికి మోటర్లు లేకపోవడంతో చుక్క నీరు రావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు బోర్లు, ఇటు మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తాగునీటిని తీసుకొచ్చుకుంటున్నామని, ఇప్పటికైనా తాగు నీటి గోస తీర్చాలని కోరారు. నిరసనలో మెయిన్ రోడ్‌కాలనీ వాసులు చిలుక యాకమ్మ, రాంపాక రజిత, ధర్మారపు వెంకటమ్మ, రాంపాక సోమనర్సమ్మ, దూదేకుల యాకమ్మ, ఎల్లమ్మ, నారాయణ, కిరణ్, వెంకట్‌రెడ్డి, శంషుద్దీన్, యాకయ్య, వెంకన్న, మల్లేశ్, కమలాకర్ పాల్గొన్నారు.



### తాగునీటి గోస తీర్చాలి

తాగు నీటి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలి. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎప్పుడూ సమస్య రాలేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా కేసీఆర్ స్వచ్ఛమైన నీటిని అందించారు. వారం రోజులుగా నీళ్లు రాక వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తాగు నీళ్లు తీసుకొస్తున్నాం. మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద కొనుగోలు చేస్తున్నాం. ఇంటికి బంధువులు వస్తే నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించాలి

– నూనావత్ జ్యోతి, మాజీ సర్పంచ్, పినిరెడ్డిగూడెం

# పరదాలు కట్టుకొని బతుకీడుస్తున్న..

- నాకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోండి
- మానుకోట కలెక్టర్‌ను వేడుకున్న దివ్యాంగుడు లక్ష్మణ్



భార్యాపిల్లలతో లక్ష్మణ్

ఇనుగుర్తి, మే 5 : 'చుట్టూ పరదాలు కట్టుకొని, పైన రేకులు వేసుకొని భార్యా పిల్లలతో నివసిస్తున్నా.. వర్షాకాలం నీళ్లతో, రాత్రిపూట పాముల భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నా.. నాకు మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోండి సారూ' అంటూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారానికి చెందిన ఓ దివ్యాంగుడు కలెక్టర్‌ను వేడుకుంటున్నాడు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అర్జీని సమర్పించాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన దివ్యాంగుడు చెడుపాక లక్ష్మణ్ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అతడికి అన్ని అర్హతలున్నా అధికారులు మాత్రం ఇల్లు మంజూరు చేయలేదు. దీంతో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకొని అదనపు కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాడు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ వ్యవసాయ భూములు, ఆర్థికంగా బలంగా ఉన్న వారి పేర్లు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఉన్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్లలో తమకు 5 శాతం కేటాయిస్తానని హామీ ఇచ్చారని, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తనకు గుంట భూమి లేదని, నెల నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తోనే కుటుంబాన్ని పోషిస్తున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. కలెక్టర్ తనకు ఇల్లు కేటాయించి ఆదుకోవాలని లక్ష్మణ్ కోరాడు.

# ఇందిరమ్మ ఇండ్లపై రచ్చరచ్చ

- వాట్సాప్ వేదికగా చర్చ.. కమిటీలపై విమర్శలు
- అనర్హులకు కేటాయిస్తున్నారని మండిపాటు
- వారి బంధువులు, స్నేహితులు, కాంగ్రెస్ కార్యకర్తలకే కట్టబెడుతున్నారని ఆరోపణ

భీమదేవరపల్లి, మే 5 : వాట్సాప్ వేదికగా ఇందిరమ్మ ఇండ్ల పథకంపై చేస్తున్న చర్చ రచ్చరచ్చవుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగింది. అయితే జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు సోషల్ మీడియా వేదికగా కొట్లుకుంటున్నారు. కొప్పూరు గ్రామంలో వాట్సాప్ వేదికగా ఓ యువకుడు ప్రశ్నల వర్షం సంధించాడు. ఓ వైపు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని చెబుతుంటే, కమిటీ సభ్యులు మాత్రం తమ ఇంట్లో వారి పేర్లనే జాబితాలో పెట్టుకున్నారని ఆరోపించాడు. గ్రామంలో మీరు ప్రతిపాదించిన వారి కంటే నిరుపేదలు లేరా అని నిలదీశాడు. అదేవిధంగా గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఏకంగా సొంత పార్టీ నాయకులే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జాబితాపై మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు వారి పేర్లే పెట్టుకుంటారా..? నిరుపేదలకు ఇవ్వరా అని ఆ పార్టీ నాయకులు బొల్లంపల్లి కాంతారావు, షడ్రక్, అంబాల రాజుకుమార్ వాట్సాప్ వేదికగా ప్రశ్నించారు. దీంతో మరుసటి రోజే పార్టీ నుంచి వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూర్ణచందర్, మరికొంతమంది ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలు, కార్యకలాపాలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. తమను బహిష్కరించే హక్కు ఎవరికీ లేదని, తప్పు చేస్తే నికార్సయిన కాంగ్రెస్ నాయకులుగా నిలదీస్తామని వారు తేల్చిచెప్పారు. దాదాపు అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ లోపభూయిష్టంగా జరుగుతుందని ప్రజలు మండిపడుతున్నారు. అర్హులను పక్కన పెట్టి ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారి బంధువులు, స్నేహితులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే కట్టబెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇంతకుముందు గ్రామాల్లో రచ్చబండ వేదికగా లేక హోటళ్లు, నాలుగుబాటల సముదాయాల్లో చర్చలు జరిగేవి. ఇప్పుడు వాట్సాప్ వేదికగా ఈ చర్చలు దండిగా జరుగుతున్నాయి. అర్హులమైన తమకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని తెలిసినా.. వాట్సాప్‌లో జరుగుతున్న చర్చలో జోక్యం చేసుకుంటే మరుసటి రోజు తమల్ని టార్గెట్ చేస్తారని భయంతో మిన్నకుంటున్నారు. ఏదేమైనా ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ద్వారా జరుగుతున్న లబ్ధిదారుల ప్రక్రియ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులకు మధ్య తీవ్ర దూరాన్ని పెంచుతుందని చెప్పవచ్చు.

# రికార్డు స్థాయిలో పసుపు ధర



మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పసుపు

**కేసముద్రం మార్కెట్‌లో క్వింటాకు రూ.13,852**

కేసముద్రం, మే 5 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పసుపు రికార్డు స్థాయిలో ధర పలికింది. జూన్‌లో సాగుచేసిన పసుపు పంట రైతులకు ప్రస్తుతం చేతికొస్తున్న క్రమంలో మార్కెట్‌కు సోమవారం 340 బస్తాలు విక్రయానికి వచ్చాయి. కాడి రకానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.13,852, కనిష్ఠంగా రూ.11,452, గోల రకానికి గరిష్ఠంగా రూ.12,051, కనిష్ఠంగా రూ.7,000 పలికింది. గతేడాది రూ.7,000 పలికిన ధర ఈ ఏడాది రూ.13వేల పైచిలుకు పలుకుతున్నది. అయితే సాగు విస్తీర్ణం తగ్గడం వల్లే ధర పెరుగుతున్నదని వ్యాపారులు తెలిపారు.



పాలకుర్తిలో గేట్ వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పల సాయిప్రకాశ్‌తో పాటు పెద్ది కృష్ణమూర్తి అనుచరులను అడ్డుకుంటున్న పోలీసులు, కాంగ్రెస్ నాయకులు

# అద్దంకి సాక్షిగా దళిత నాయకుడికి అవమానం

- యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిని అడ్డుకున్న పోలీసులు, కాంగ్రెస్ నేతలు
- వేదికపైకి పిలువకపోవడంతో అలిగి వెళ్లిన సీనియర్ నేత లక్ష్మీనారాయణ నాయక్

పాలకుర్తి, మే 5 : దళితుల హక్కులు, అణచివేతలపై మాట్లాడే ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సాక్షిగానే దళితుడికి అవమానం జరిగినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనగామ జిల్లా పాలకుర్తిలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంస్థాగత నిర్మాణ సన్నాహక విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిశీలకులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, ఇన్‌చార్జి లింగం యాదవ్, డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జెన్నారెడ్డి, భరత్ చందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి దేవరుప్పుల మండలకేంద్రానికి చెందిన మాజీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అనుచరులతో పాటు పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉప్పల సాయిప్రకాశ్ వచ్చాడు. వీరిని పోలీసులు, కాంగ్రెస్ నాయకులు గేట్ ముందే ఆపి వెనక్కి పంపించేశారు. ఈ ఘటనపై పెద్ది అనుచరులు, సాయిప్రకాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ సమావేశానికి దళిత నాయకుడు అద్దంకి దయాకర్ వచ్చినా దళిత బిడ్డనైన తనను ఎందుకు పంపరని సాయిప్రకాశ్ గొడవకు దిగాడు. పార్టీ సభలో పోలీసుల అత్యుత్సాహం ఏమిటని ప్రశ్నించాడు. కాంగ్రెస్‌లో దళితులు, బీసీలకు స్థానం లేదని పలువురు వాపోయారు. పాలకుర్తి కాంగ్రెస్ మొత్తం రెడ్డి, వెలమ కాంగ్రెస్‌గా మారిందని ఎద్దేవా చేశారు. పాలకుర్తి కాంగ్రెస్‌లో మాజీ మంత్రి దయాకర్‌రావు కోవర్టులది అనుచరులదే నడుస్తోందన్నారు. అలాగే దేవరుప్పుల మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, టీ పీసీసీ సభ్యుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి భర్త డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్‌కు సమావేశంలో తీవ్ర అవమానం జరిగింది. పాలకుర్తి నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా టీ పీసీసీ సభ్యుడిగా లక్ష్మీనారాయణ నాయక్ కొనసాగుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేశాడు. అలాంటి వ్యక్తిని సైతం స్టేజీ పైకి పిలువకపోవడంతో ఆయన సమావేశం నుంచి అలిగి వెళ్లిపోయారు. ఏదేమైనా నియోజకవర్గ కాంగ్రెస్‌లో వర్గపోరు మరోసారి రచ్చకెక్కింది. కాంగ్రెస్ సభకు పోలీసుల పహారా అంటూ పలువురు చర్చించుకున్నారు.

### దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి

*– మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్*

కాళేశ్వరంపై కాంగ్రెస్ సర్కారు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నదని, వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉన్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నీళ్లు అందించామని నల్గొండ, ఖమ్మం, మెదక్ లాంటి జిల్లాలను కాళేశ్వరం నీళ్లు సస్యశ్యామలం చేశామని గుర్తుచేశారు. ఎన్‌డీఎస్‌ఏ సైతం పిల్లర్లకు మరమ్మతులు చేసి నీళ్లను నిల్వ చేయాలని చెప్పిందని ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని చెప్పలేదన్నారు. చిన్న సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం బూతద్దంలో పెట్టి చూపించి ప్రజలను నమ్మించే కుట్రలు చేసిందని, ఇప్పటికే కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు ఒకసారి మోసపోయారన్నారు. ఇలాంటి చర్చా వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు.

### నమ్మితే నట్టేట ముంచాడు

*– పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే*

మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా మేలు చేస్తాడని నమ్మిన ప్రజలను నట్టేట ముంచిన చరిత్ర ప్రస్తుత మంథని ఎమ్మెల్యేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బెల్ట్‌షాపులను తొలగిస్తామని, నాలుగు వేల పింఛన్, మహిళలకు రూ.2500, కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం ఇప్పిస్తామని నమ్మించి వంచించాడన్నారు. చిన్న కాళేశ్వరం పూర్తి చేస్తామని చెప్పి ఈనాడు పంటలు సాగు చేసే భూములను లాక్కొని కాల్వలు తవ్వుతున్నారని, వెంటనే భూసేకరణ నిలిపివేసి గ్రామసభల ద్వారా పరిశీలన చేసి పనులు చేయాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య, భూపాలపల్లి, జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, దావ వసంత, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేశ్, మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు మాడ హరీశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వసంత, శ్రీపతి బాపు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న మండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, పక్కన మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యేలు

# నిర్లక్ష్యం చేస్తే జల సాధన ఉద్యమమే..

- పాలన చేతకాక బరాజ్‌పై కాంగ్రెస్ కుట్రలు
- ప్రపంచంలోనే అద్భుత ప్రాజెక్టు కాళేశ్వరం
- మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. వాస్తవాల'పై చర్చావేదిక

మహదేవపూర్(కాళేశ్వరం), మే 5 : పాలన చేతకాక, అసమర్థత కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ సర్కార్ అనేక కుట్రలు చేస్తూ సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా ఆగం చేస్తున్నదని.. ఈ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే మున్ముందు జలసాధన ఉద్యమం తప్పదని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి స్పష్టం చేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. వాస్తవాలు'పై చర్చావేదికకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, సాగునీటి రంగ నిపుణులు వీరమల్ల ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సిరికొండ మాట్లాడుతూ అపార జల రాశులున్న తెలంగాణ నీటి కోసం గోస పడుతున్న క్రమంలో కాకతీయులను ఆదర్శంగా తీసుకొన్న కేసీఆర్ నీటిని ఒడిసిపట్టే వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రపంచంలోనే అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. పదేండ్లపాటు కాళేశ్వర జలాలతో అనేక ప్రయోజనాలు పొందామని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలనే కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. ఈ క్రమంలో ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలను పటాపంచలు చేసే ఆలోచనతో చర్చా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సమైక్య పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వివక్షకు గురైందని, దీంతో నీళ్లు, నిధులు, ఉద్యోగాలు, కరెంటుతో పాటు అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక రాష్ట్రం సాధించుకోవడమే ఏకైక మార్గమని గుర్తించిన కేసీఆర్ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని చేపట్టారని గుర్తుచేశారు. సాధించుకున్న తెలంగాణను తొమ్మిదిన్నరేళ్లలో ఊహించని రీతిలో అభివృద్ధి చేసి ప్రపంచం దృష్టిని మన వైపు మరల్చేలా చేశారన్నారు. సాగునీటి రంగంలో అపురూపమైన అభివృద్ధి సాధించారని అన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో మళ్లీ సమైక్య పాలన గుర్తుకు వస్తున్నదన్నారు. తెలంగాణ రైతాంగానికి, ప్రజలకు కల్పతరువుగా మారిన ప్రాజెక్టులోని మూడు పిల్లర్లను రిపేరు చేయలేని దుస్థితిలో ఉండి రైతులను అరిగోస పెడుతున్నారని మండిపడ్డారు. కనీసం అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ద్వారా రైతులకు నీళ్లు అందించే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేయకుండా కేసీఆర్ మార్క్‌ను చెరిపేయాలనే ఏకైక లక్ష్యంతో రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నియోజకవర్గానికి చెందిన వ్యక్తే మేనిఫెస్టో రాశాడని, ఇప్పుడు నియోజకవర్గంలో రైతులు సాగునీటికి తండ్లాడే పరిస్థితులు అతనికి కనిపించడం లేదా?, అధిష్టానంతో మాట్లాడే సత్తా లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కుట్రలు ఇక సాగనివ్వమని, గ్రామగ్రామాన కాంగ్రెస్ కుట్రలపై చర్చ జరుగాలని, ప్రతి ఒక్కరు చైతన్యవంతులు కావాలని కోరారు.

### కుంగుబాటుపై అనుమానాలున్నాయి

*– సాగునీటి రంగ నిపుణులు ప్రకాశ్*

మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగుబాటుపై అనుమానాలున్నాయని సాగునీటి రంగ నిపుణులు ప్రకాశ్ అన్నారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు బాగానే ఉన్నాయని, ఎన్‌డీఎస్‌ఏ సైతం ఈ రెండు బరాజ్‌లు రిపేరు చేయాలని సూచించలేదని, సీఎం రేవంత్ మాత్రం రవీంద్రభారతి సాక్షిగా మూడు బరాజ్‌లు కూలిపోయాయని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో 50శాతం నిధులు రైతు సంక్షేమం కోసమే ఖర్చు చేశారని గుర్తుచేశారు.

# కుళ్లిన మాంసం.. బూజు పట్టిన చికెన్

- ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులతో వెలుగులోకి
- రెండు రెస్టారెంట్లకు నోటీసులు, ల్యాబ్‌కు శాంపిళ్లు
- నివేదిక వచ్చాక చట్టరీత్యా చర్యలు : జ్యోతిర్మయి



బూజు పట్టిన చికెన్, కుళ్లిన మాంసం

వరంగల్,మే 5 : కుళ్లిన మాంసం, బూజు పట్టిన చికెన్, కంపు కొట్టే రిఫ్రిజిరేటర్లు, బిర్యానీ, చికెన్ ఫ్రైలో మోతాదుకు మించి రసాయనాలు.. ఈ విస్తుపోయే నిజాలు సోమవారం నగరంలో స్టేట్ ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ దాడులతో వెలుగులోకి వచ్చాయి. లాభాపేక్షే ధ్యేయంగా కొన్ని హోటళ్లు కనీస ప్రమాణాలు, శుభ్రత పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న తీరు బయటపడింది. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ హెడ్, జోనల్ కంట్రోలర్ జోతిర్మయి నేతృత్వంలో అధికారుల బృందం హనుమకొండలోని ఫుడ్ ఆన్ ఫైర్, ల్యాండ్ మార్క్ రెస్టారెంట్‌లపై ఆకస్మిక దాడులు చేశారు. దుర్వాసన వెదజల్లుతున్న రిఫ్రిజిరేటర్లు, రోజుల తరబడి నిల్వ ఉంచి మాంసం, బూజు పట్టిన చికెన్ ఉండడంతో నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారు చేసిన బిర్యానీ, చికెన్ ఫ్రై లాంటి వంటకాల్లో మోతాదుకు మించి ఆరోగ్యానికి హానికర రసాయనాలు వాడటాన్ని గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన 32 కిలోల కుళ్లిన మాంసం, బూజు పట్టిన చికెన్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. శాంపిళ్లను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ఫుడ్ సేఫ్టీ చట్టం 2006ను ఉల్లంఘించినందుకు హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. నివేదిక వచ్చాక చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జ్యోతిర్మయి తెలిపారు. రెస్టారెంట్లు, హోటల్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# కాసులిస్తేనే కాంటాలు!

- కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది నిర్వాకం
- దళారులతో కుమ్మక్కవుతున్న నిర్వాహకులు
- రైతుల వద్ద నేరుగా కొన్న వడ్లకు కాంటాలు



కొనుగోలు కేంద్రంలోనే ఉన్న ధాన్యం బస్తాలు

నర్సింహులపేట, మే 5 : కొనుగోలు కేంద్రాలు అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. కేంద్రం నిర్వాహకులు, ప్రైవేట్ వ్యాపారులు (దళారులు) కుమ్మక్కై అన్నదాతను నిండా ముంచుతున్నారు. కాసులిచ్చిన వారికే కాంటాలు పెడుతూ, ఇవ్వని రైతులను రోజుల తరబడి అక్కడే ఉంచుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నర్సింహులపేట, పెద్దనాగారంలో, ఐకేపీ ఆధ్వర్యంలో ముంగిమడుగు, వంతడపల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు తీసుకురాగా, నిర్వాహకులు రోజుల తరబడి కాంటాలు పెట్టకపోవడంతో అకాల వర్షాలకు తడిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నర్సింహులపేట, ముంగిమడుగులో ఈ సమస్య ఎక్కువగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇద్దరు ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కైన నిర్వాహకులు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రాలకు తీసుకొస్తే తేమ శాతం లేనప్పటికీ గన్నీ సంచులు ఇస్తూ కాంటాలు సైతం పెట్టి మిల్లులకు 1000 బస్తాలు తరలించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. డీసీసీ బ్యాంకు అధికారి బంధువు కేంద్రంలో పనిచేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, పైసలిచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు.



బిల్లులు ఇప్పించాలని కలెక్టర్‌కు దండం పెడుతున్న మాజీ సర్పంచ్ రవీందర్‌రావు

# పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్ ఆందోళన

- ప్రజావాణిలో కలెక్టర్‌తో వాగ్వాదం
- కలెక్టరేట్‌లో కొద్దిసేపు ఉద్రిక్తత
- బయటకు పంపించిన పోలీసులు



రవీందర్‌రావును బయటకు తీసుకెళ్తున్న పోలీసులు

హనుమకొండ, మే 5 : పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఓ మాజీ సర్పంచ్ సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆందోళనకు దిగాడు. ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నడికూడకు చెందిన మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు చేరుకున్నాడు. నేరుగా కలెక్టర్ ప్రావీణ్య వద్దకు వెళ్లి ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని వాదనకు దిగాడు. దీంతో అక్కడే ఉన్న పలువురు అధికారులు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. తాను బిల్లులు చెల్లించేంత వరకు ఇక్కడే ఉంటానని రవీందర్‌రావు మొండికేయడంతో పోలీసులు బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారుల ఒత్తిడి మేరకు అప్పుచేసి నడికూడ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టానని, సుమారు రూ. 40 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పులు తీర్చలేక కుటుంబం రోడ్డుపై పడే పరిస్థితి వచ్చిందన్నాడు. బిల్లులు అడిగితే పోలీసులతో బయటకు నెట్టివేయించడం, అరెస్టులు చేయడమే ప్రజా పాలనా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు నా బాధ చెప్పుకుందామంటే పోలీసులతో బయటకు నెట్టివేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.